క్లుప్తంగా

గుడికి ఇల్లు అప్పగింత



స్టేషన్‌ఘన్‌పూర్: మండలంలోని తాటికొండలో శ్రీసీతారామచంద్రస్వామి గుడి పక్కన ఉన్న గ్రామానికి చెందిన అర్చకుడు సౌమిత్రి వెంకటనర్సింహాచార్యులు తన ఇంటిని సోమవారం ఆలయానికి అప్పగించారు. ఈమేరకు సంబంధిత పత్రాలు, అగ్రిమెంట్ కాగితాలను గ్రామ సర్పంచ్ చల్లా ఉమాదేవి, వైస్ ఎంపీపీ చల్లా సుధీర్‌రెడ్డికి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద అందించారు. కాగా, దేవస్థానానికి ఇంటిని అందించిన అర్చకుడిని సర్పంచ్, వైస్ ఎంపీపీ, గ్రామ పెద్దలు శాలువాతో సన్మానించారు. గ్రామస్తుల కోరిక మేరకు దేవస్థాన పూజారిగా అర్చకుడు వరుణ్ కొనసాగుతారని సర్పంచ్ తెలిపారు. గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

దుర్గామాత ఆలయానికి భూ దానం



దాత సాయిబాబ

బచ్చన్నపేట: బండనాగారంలో నూతనంగా నిర్మించనున్న దుర్గామాత ఆలయానికి గ్రామానికి చెందిన జంగిలి సాయిబాబ, రమాదేవి దంపతులు స్థలాన్ని సోమవారం దానంగా ఇచ్చారు. ఈ సందర్భంగా సర్పంచ్ శివరాత్రి కవిత మాట్లాడుతూ సాయిబాబ తండ్రి మంకయ్య జ్ఞాపకార్థం అందజేసినట్లు తెలిపారు. స్థల దాతను గ్రామస్తులు అభినందించారు. పూజారి బాలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



చిల్పూరు: రాజవరం సమీపంలో నిర్మించిన కస్తూర్బా బాలికల విద్యాలయానికి, పలు అభివృద్ధి పనులకు సోమవారం వేలేరు మండలం సోడాషపల్లిలో ఏర్పాటు చేసిన సభలోనే మంత్రి కేటీఆర్ శిలాఫలకానికి శంకుస్థాపన చేశారు. జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి స్వగ్రామమైన రాజవరంలో నిర్మించిన పాఠశాలను మంత్రి కేటీఆర్ వేలేరు మండల పర్యటన నేపథ్యంలో ఇక్కడకు పిలిచి శంకుస్థాపన చేయించాలనుకున్నారు. కాని అది కుదరక పోవడంతో సభలోనే మంత్రి శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీలు కడియం శ్రీహరి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, ఎంపీపీ సరితబాల రాజు, సర్పంచ్ మారేపల్లి తిరుమలకృష్ణమోహన్‌రెడ్డి, ఎంపీటీసీ లలితశ్యాంకుమార్‌రెడ్డి, ఎస్‌ఓ ప్రశాంతి ఉన్నారు.

ప్రీతి మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలి

పాలకుర్తి టౌన్: వైద్య విద్యార్థిని ధరావత్ ప్రీతి మృతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ చేపట్టాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి మామిండ్ల రమేష్‌రాజా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో మాట్లాడుతూ ర్యాగింగ్‌ను ప్రభుత్వం నియంత్రించలేక పోతుందని అన్నారు.

సైఫ్‌ను ఉరితీయాలి

స్టేషన్‌ఘన్‌పూర్: డాక్టర్ ప్రీతి మృతికి కారణమైన సైఫ్‌ను బహిరంగంగా ఉరితీయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కాంగ్రెస్ పార్టీ ఘన్‌పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర డిమాండ్ చేశారు. ఘన్‌పూర్‌లో ఇందిర సోమవారం విలేకరులతో మాట్లాడారు. ర్యాగింగ్ రూపంలో ప్రాణాలు కోల్పోయిన డాక్టర్ ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలని, ఆమె ఆత్మహత్యకు కారణమైన కళాశాల యాజమాన్యం, నిందితుడు సైఫ్‌పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రీతి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు శిరీష్‌రెడ్డి, నాయకులు వెంకటయ్య, ఎల్లయ్య, నాగయ్య, మహేందర్ పాల్గొన్నారు.

ఉద్యమకారుల సదస్సును విజయవంతం చేయండి



రఘునాథపల్లి: హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మార్చి 12న నిర్వహించనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సదస్సును విజయవంతం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చీమ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన ఉద్యమకారులతో కలిసి సదస్సు వాల్ పోస్టర్లు ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో రాష్ట్ర వైస్ చైర్మన్ పరీదుల శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పట్ల సురేందర్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు శ్రీనివాస్, వీరస్వామి, రవీందర్, సుదర్శన్, జంపయ్య, కుమార్, అశోక్, శ్రీశైలం పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

- అధికారులకు కలెక్టర్ శివలింగయ్య ఆదేశం
- గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 67 అర్జీలు
- స్వీకరించిన కలెక్టర్, ఇతర అధికారులు



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ శివలింగయ్య, అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్

జనగామ రూరల్: ప్రజలు అర్జీల ద్వారా తెలియజేసిన సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ సీహెచ్.శివలింగయ్య సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌కు వివిధ సమస్యలపై 67 అర్జీలు రాగా.. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్‌తో కలిసి ఆయన స్వీకరించారు. వచ్చిన అర్జీల్లో తహసీల్దార్ పరిధిలో 39, ఆర్డీఓ, డీఆర్‌డీఓ 5 చొప్పున, పీఆర్, ఉపాధి, ఎస్సీ కార్పొరేషన్, పోలీసు శాఖకు రెండు చొప్పున, బీసీ వెల్ఫేర్, సివిల్ సప్లయ్, ఆర్‌అండ్‌బీ, విద్యుత్ శాఖ, ఎంపీడీఓ, దేవాదుల ఒకటి చొప్పున, ఇరిగేషన్ శాఖ 4 వినతులు వచ్చాయి.

రైస్ మిల్లుతో ఇబ్బంది పడుతున్నం



గ్రామంలో నిబంధనలకు విరుద్ధంగా పారా బాయిల్డ్ రైస్ మిల్లు నిర్మాణం చేపట్టారు. మిల్లు నుంచి పొగ, దుమ్ము, ధూళి వచ్చి పొలాలపై పడి మొక్కలు ఎర్రబడి దిగుబడి రావడం లేదు. చెరువులోకి రావాల్సిన దేవాదుల నీటిని 200 మీటర్ల దూరంలో నిలిపివేశారు. తగిన చర్యలు తీసుకుని పంటలను కాపాడాలి.

– బూరుగు ప్రవీణ్, గొల్లపల్లి (దేవరుప్పుల)

అక్రమంగా పట్టా చేసుకున్నారు..



గ్రామంలోని సర్వే నంబర్ 161బీ1, 162బీ1, 163బీ1, 165బీ1లో 17 ఎకరాల 29 గుంటల భూమి ఉంది. ఇందులో 15 ఎకరాల 30 గుంటలు మాత్రమే పట్టా అయింది. మిగతా భూమిని కొందరు అక్రమంగా పట్టా చేసుకున్నారు. 2014 నుంచి తిరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదు.

– బర్ల రాజయ్య, నెల్లుట్ల

ట్రై సైకిల్ ఇప్పించండి



నాకు పుట్టుకతోనే శారీరక వైకల్యం ఉంది. రెండు కాళ్లు పని చేయవు. బయటికి వెళ్లాలన్నా ఒకరి సాయం లేనిదే కుదరదు. ట్రై సైకిల్ ఇప్పించి ఆదుకోవాలి.

– రసాల సోమయ్య, ఏడునూతుల (కొడకండ్ల)

పింఛన్ మంజూరు చేయాలి



వినికిడి లోపం కింద 41 శాతం వైకల్యం ఉందని 2014లో సదరం సర్టిఫికెట్ ఇచ్చారు. పింఛన్ కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే సర్టిఫికెట్ చెల్లదు.. కొత్తది కావాలంటున్నారు. సర్టిఫికెట్ ఇప్పించి పింఛన్ మంజూరు చేయాలి.

– రామగుండం ఎల్లమ్మ, వెంకిర్యాల

నమ్మించి సంతకం తీసుకున్నారు..



గ్రామంలోని సర్వే నంబర్ 533ఎఫ్11లో 2 ఎకరాల 37 గుంటల భూమి ఉంది. కూతురు, అల్లుడు కారు కొనుక్కుంటామని నమ్మించి తహసీల్దార్ కార్యాలయంలో నాతో సంతకం తీసుకుని భూమిని అక్రమంగా పట్టా చేసుకున్నారు. గత ఏడాది నుంచి రైతుబంధు రావడం లేదు. భూమి నా పేర చేయించాలి.

–జాటోత్ ద్వాలి, పలువోడుతండా (కొడకండ్ల)

ప్రీతి అంత్యక్రియలకు ప్రముఖుల హాజరు

మృతదేహం వద్ద నివాళులు

కొడకండ్ల/దేవరుప్పుల: కొడకండ్ల మండలం గిర్నిబావితండాలో సోమవారం జరిగిన మెడికో ప్రీతి అంత్యక్రియలకు పలువురు ప్రముఖులు హాజరయ్యారు. ఆమె మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.

ప్రీతిది ప్రభుత్వ హత్యే..

– డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి



నివాళులర్పిస్తున్న జంగా రాఘవరెడ్డి

డీసీసీ అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి, టీపీసీసీ సభ్యులు డాక్టర్ ఎల్ లక్ష్మీనారాయణనాయక్ మాట్లాడుతూ ఒక పీజీ మెడికల్ విద్యార్థిగా రాణించాలంటే 14ఏళ్ల శ్రమ అవసరం. అలాంటి తపస్సు కలిగిన విద్యను ఆర్జించే విద్యార్థుల పరిరక్షణ పట్ల రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి తగదన్నారు. నాటకీయంగా ప్రీతికి చికిత్సలు చేయడం చూస్తుంటే ఇది ఆత్మహత్య కాదు హత్యే.

యుద్ధప్రాతిపదికన అంత్యక్రియల మతలబు ఏమిటి..?

– ఎంఎస్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

గత వారం రోజులుగా మృత్యుకోరల్లో ఉన్న ప్రీతి ఉదంతాన్ని గోప్యంగా ఉంచిన ప్రభుత్వం ప్రీతి తుదిశ్వాస వీడగానే యుద్ధప్రాతిపదికన పోస్టుమార్టం జరిపి పోలీసు కనుసన్నల్లో అంత్యక్రియలు చేయడంలో మతలబు ఏమిటని మంద కృష్ణమాదిగ ప్రశ్నించారు. గిరిజన, దళిత బిడ్డలు రాలిపోతే కనీసం శవాన్ని చూసేందుకు రాకుండా అరెస్టుల పర్వం కొనసాగించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ సర్కారుకు కుల వివక్షత లేకుంటే ప్రియాంకరెడ్డి మాదిరిగా ప్రీతి తల్లిదండ్రుల డిమాండ్‌ను ఆచరణాత్మకంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.

గిరిజనులపై పాలకవర్గాల వివక్ష తగదు..

– పలు సంఘాల నేతలు

గిరిజనుల పట్ల పాలకవర్గాల వివక్ష తగదని నంగారాభేరీ రాష్ట్ర నాయకులు సురేష్‌నాయక్, నరేందర్ పవార్, రాజేష్ నాయక్ విమర్శించారు. ప్రీతి ఉదంతంపై సమగ్ర విచారణ జరిపి ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

రెండు ఉద్యోగాలు ఇవ్వాలి..

– జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్ గాంధీనాయక్

సైఫ్ వేధింపులతో బలైన ప్రీతి కుటుంబానికి ప్రభుత్వం రెండు ఉద్యోగాలను ఇచ్చి నిందితులను కఠినంగా శిక్షించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని జీసీసీ మాజీ చైర్మన్ అభిమన్ గాంధీనాయక్ కోరారు.

న్యాయం జరిగేంతవరకూ పోరాడుతాం..

– ములుగు ఎమ్మెల్యే సీతక్క

డాక్టర్ ప్రీతి కుటుంబానికి న్యాయం జరిగేంతవరకూ తాము అండగా ఉండి పోరాడుతామని ములుగు ఎమ్మెల్యే సీతక్క పేర్కొన్నారు. సోమవారం సాయంత్రం ప్రీతి కుటుంబ సభ్యులను ఆమె పరామర్శించి ఓదార్చారు. హైకోర్టు సిట్టింగ్ జడ్జిచే సమగ్ర విచారణ జరిపి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ద్వారా నిందితులను గుర్తించి దిశ తరహాలో న్యాయం చేయాలన్నారు. అలాగే ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ నీలం పద్మ, రాధ, వంగాల కళ్యాణి, కామిని జయ ఉన్నారు.

జ్యుడీషియల్ విచారణ చేయాలి..

– మాజీ ఎంపీ రవీందర్‌నాయక్

మా గిరిజన బిడ్డ డాక్టర్ ప్రీతి ఘటనపై అనేక అనుమానాలకు తావిస్తున్నందున జ్యుడీషియల్ విచారణ జరిపి నిజాలను నిగ్గు తేల్చాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎంపీ ధరావత్ రవీందర్‌నాయక్ డిమాండ్ చేశారు.



ప్రీతి కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సీతక్క, మంద కృష్ణమాదిగ తదితరులు

యువత బాధ్యతలను గుర్తించాలి



ప్రథమ బహుమతి అందుకుంటున్న ఆలేరు టీం

నర్మెట: మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువత బాధ్యతలను గుర్తెరిగి అన్నిరంగాల్లో రాణించాలని ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి అన్నారు. మచ్చుపహాడ్‌లో స్వర్గీయ పెద్ది సంజీవరెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న ఉమ్మడి వరంగల్, సిద్దిపేట జిల్లాల కబడ్డీ డే అండ్ నైట్ క్రీడా పోటీలు ముగిశాయి. ఆదివారం రాత్రి జరిగిన బహుమతుల ప్రదానోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. పాశ్చాత్య పోకడలు యువత భవిష్యత్‌ను అంధకారంలోకి నెట్టేలా ఉన్నాయని, చెడువ్యసనాలకు అలవాటుపడి క్షణికావేశంలో ఆత్మహత్యలకు పాల్పడటం విచారకరమన్నారు. మానసిక ధైర్యాన్ని, దేహదారుఢ్యాన్ని ఇచ్చే క్రీడలు, యోగా, వ్యాయామాన్ని దినచర్యలో భాగంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల్లో 45 టీంలు పాల్గొనగా మహబూబాబాద్ జిల్లా ఆలేరు టీం ప్రథమ, జనగామ జిల్లా వల్మిడి టీం ద్వితీయ, బ్రాహ్మణకొత్తపల్లి జట్టు తృతీయ, హనుమకొండ అశోక్‌నగర్ టీం నాలుగో స్థానం, మచ్చుపహాడ్ జట్టు ఐదో స్థానం, ఆగాపేట జట్టు ఆరో స్థానంలో నిలిచాయి. కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ఎర్రోల్ల కుమార్, పరశురాములు, ఎంపీపీలు తేజావత్ గోవర్ధన్, బద్దిపడిగ కృష్ణారెడ్డి, జెడ్పీటీసీలు మాలోత్ శ్రీనివాస్, గిరి కొండల్‌రెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ.గౌస్, సర్పంచ్‌లు రామిని శివారాజ్, కిరణ్, శ్రీను నాయక్, పావని జయరాం, నీలా లాలు, అనిత మంగనీయ, స్వేతా కిషన్ పాల్గొన్నారు.

మల్కాపూర్‌లో 'కంటి వెలుగు'



చిల్పూరు: మల్కాపూర్ గ్రామంలో సోమవారం 'కంటి వెలుగు' శిబిరాన్ని జెడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కృష్ణారెడ్డి ప్రారంభించారు. అనంతరం సర్పంచ్ కొంగరి రవి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉప సర్పంచ్ వంశి, అధికారులు ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి, ఎంపీఓ మధుసూదన్, డాక్టర్ బాణాల రాజమౌళి, ఎంపీటీసీ సుధాకర్, పోలేపల్లి రంజిత్‌రెడ్డి, మాధవరెడ్డి పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను వినియోగించుకోవాలి

దేవరుప్పుల: తెలంగాణ ప్రభుత్వం పేదలపాలిట తలపెడుతున్న కంటివెలుగు శిబిరాలను వినియోగించుకోవాలని ఎంపీపీ బస్వ సావిత్రి సూచించారు. సోమవారం పెద్దమడూరులో కంటివెలుగు శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. సర్పంచ్ ఆకవరం సృజనారెడ్డి, ఎంపీటీసీ గిరిబాబు, ఉపసర్పంచ్ వెంకన్న, డాక్టర్ యేల అనిల్‌కుమార్, మైదం శ్రీలక్ష్మి, ఆప్తాల్మిస్టు బొబ్బిలి, ఆరోగ్య సిబ్బంది భాగ్యమ్మ, సుజనా, భద్రి, జ్యోతి, పంచాయతీ కార్యదర్శి శివారెడ్డి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ, ఐకేపీ వీఓఏలు పాల్గొన్నారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



బచ్చన్నపేట నుంచి సభకు వెళ్తున్న బీఆర్‌ఎస్ నాయకులు



రఘునాథపల్లి: వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న నాగుర్ల వెంకటేశ్వర్లు



జనగామరూరల్: తరలివెళ్తున్న నియోజకవర్గ సమన్వయకర్త గుజ్జ సంపత్‌రెడ్డి తదితరులు



చిల్పూరు: నినాదాలు చేస్తున్న నాయకులు



స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి..

జనగామ రూరల్/స్టేషన్‌ఘన్‌పూర్/బచ్చన్నపేట/రఘునాథపల్లి/లింగాలఘణపురం/చిల్పూరు/జఫర్‌గఢ్: హనుమకొండ జిల్లా వేలేరు మండలం షోడషపల్లిలో సోమవారం నిర్వహించిన మంత్రి కేటీఆర్ బహిరంగ సభకు జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివెళ్లారు. జై తెలంగాణ, జై కేసీఆర్, జై కేటీఆర్ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. తరలివెళ్లిన వారిలో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

అక్రమ పట్టాపై కలెక్టర్‌కు ఫిర్యాదు



బాధితుడు వెంపల్ల సుధాకర్‌రెడ్డి

రఘునాథపల్లి: తల్లిదండ్రుల పేరిట ఉన్న భూమిని ముగ్గురి వారసుల పేరిట కాకుండా ఇద్దరి పేరిట అక్రమ పట్టా చేసిన రఘునాథపల్లి తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సోమవారం బాధితుడు వెంపల్ల సుధాకర్‌రెడ్డి కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంపల్ల అంజిరెడ్డి, కమలమ్మ దంపతులకు ముగ్గురు కుమారులమన్నారు. మా తల్లిదండ్రులు మరణించిన అనంతరం వారి పేరిట ఉన్న రామన్నగూడెం శివారులో ఉన్న 16 ఎకరాల భూమిలో మా సోదరులు గోవర్ధన్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డిలతో పాటు నాకు ఆస్తిలో వాటా రావాల్సి ఉందన్నారు. తప్పుడు ధ్రువపత్రాలతో ఇద్దరు సోదరులు పట్టా చేయించుకున్నారన్నారు. ఈ విషయమై తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదన్నారు. తమకు వారసత్వంగా రావాల్సిన భూమిని దక్కేలా చూడాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై తహసీల్దార్ అన్వర్‌ను వివరణ కోరగా స్లాట్ బుక్ చేసుకుని రావడంతో పట్టా చేశామన్నారు.

విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలి



మాట్లాడుతున్న ఎస్సై జీనత్

జనగామ: విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రమశిక్షణతో చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఎస్సై జీనత్ కుమార్ అన్నారు. పట్టణంలోని హనుమకొండ రోడ్డు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో సోమవారం సైబర్ క్రైం, నేరాలు తదితర వాటిపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. నేరాలు, క్రైంనకు విద్యార్థులు దూరంగా ఉండాలన్నారు. గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కనకాల శ్రీనివాసరావు, నరసింహులు గౌడ్, నాగేశ్వరరావు, కిషన్, బాబు, చందు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

జయప్రదం చేయాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాజు తదితరులు

జఫర్‌గఢ్: ఈ నెల 28న హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద నిర్వహించనున్న పంచాయతీ సిబ్బంది పాదయాత్ర ముగింపు సభను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు పిలుపునిచ్చారు. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో సంఘం నాయకులు, కార్మికులు, పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన వాల్‌పోస్టర్లను సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12 నుంచి పాలకుర్తి మండల కేంద్రం నుంచి హైదరాబాద్ వరకు పాదయాత్ర చేపట్టడం జరిగిందన్నారు. కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు యాతం సమ్మయ్య, నల్లతీగల శ్రీనివాస్, సిద్దం సోమయ్య, కుల్లా రామచంద్రం, కుమార్ ఉన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



పాలకుర్తి: పతకాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పాలకుర్తి: వరంగల్‌లోని జీడబ్ల్యూఎంసీ ఇండోర్ స్టేడియంలో సుమన్ షోటోకాన్ కరాటే ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో పాలకుర్తి కేజీబీవీ విద్యార్థినులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారని స్పెషల్ ఆఫీసర్ నవీన్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాలలో పోటీల్లో ప్రతిభకనబరచిన విద్యార్థులను ఆయన అభినందించారు. పీఈటీ సుస్మిత, కరాటే మాస్టర్ బాలు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సింగరాజుపల్లి హైస్కూల్..

దేవరుప్పుల: వరంగల్‌లో నిర్వహించిన కరాటే పోటీలో సింగరాజుపల్లి హైస్కూల్ విద్యార్థులు ఉప్పునూతుల భవ్యశ్రీ గోల్డ్ మెడల్, వట్టిపల్లి పూజ సిల్వర్ మెడల్ సాధించారని పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ సందర్భంగా సోమవారం ప్రతిభ కనబరిచిన విద్యార్థులను వైస్‌ఎంపీపీ కత్తుల విజయ్‌కుమార్‌రెడ్డి, సర్పంచ్ మల్లేష్, కరాటే కోచ్ స్వామి, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

సంక్షిప్త సమాచారం

బియ్యం అందజేత

లింగాలఘణపురం: మండలంలోని నేలపోగులలో ఇటీవల గొడిశాల రవి మృతి చెందగా ఎంపీటీసీ గుగ్గిళ్ల నర్సయ్య బాధిత కుటుంబానికి క్వింటాల్ బియ్యం అందజేసి చేయూతనిచ్చారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ ఎల్లమ్మ, వార్డు సభ్యులు యాకలక్ష్మి, అబ్బసాయిలు, నాయకులు ఉన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జనగామ రూరల్: ఇందిరమ్మ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని లబ్ధిదారుల పోరాట సంఘం సభ్యురాలు ముసిపట్ల జయ డిమాండ్ చేశారు. సోమవారం మూడో విడత డబుల్ బెడ్రూం సాధన కమిటీ ఆధ్వర్యంలో చేపడుతున్న నిరాహార దీక్షలను ఆమె ప్రారంభించి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో పేదలకు పట్టాలు ఇచ్చి 6 నెలల్లో ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పి నేటికీ ఇవ్వలేదన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులను సర్వే చేస్తామనడం మోసగించడమేనని అన్నారు. ఎర్ర రజిత, ఎండీ గౌస్య, అనిత, భాగ్య లక్ష్మితోపాటు తదితరులు పాల్గొన్నారు.

'ఆయుష్మాన్ భారత్'కు నమోదు చేసుకోవాలి

బచ్చన్నపేట: ప్రధాని నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకానికి ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని సీఎస్‌సీ నిర్వాహకుడు రాపెల్లి వెంకటేశ్వర్లు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడారు. ఈ పథకంలో సభ్యత్వం పొందిన వారు అనారోగ్యంతో బాధపడితే రూ.5 లక్షల వరకు ఉచిత వైద్యం అందిస్తారని చెప్పారు. నాయకులు గద్ద రాజు, జూకంటి గణేష్, బంగారు మహేష్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

ఎన్నిక

పాలకుర్తి టౌన్: ఆర్‌ఎంపీ, పీఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ మండల నూతన కమిటీని సోమవారం మండల కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆ సంఘం అధ్యక్షుడిగా పోగు శ్రీనివాస్, అధ్యక్షుడిగా చిట్యాల వేణు, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాస్, కార్యదర్శిగా బిర్రు సోమేశ్వర్, సహాయ కార్యదర్శిగా ఎండీ యాకుబ్, కోశాధికారిగా కోట రాంమూర్తి, సలహాదారులుగా వేముల శ్రీనివాస్, చిట్యాల సోమనారాయణ, పూస్కూరి రాజేశ్వర్‌రావు, దాసరి విజయ్‌కుమార్, దుంపల సతీష్, నూతనకంటి సతీష్, పాము రవీందర్‌ను ఎన్నుకున్నారు.

నా భూమి ఇప్పించండి

లింగాలఘణపురం: మండలంలోని సిరిపురంలో సర్వే నంబర్ 233/ఏ/4లో 33 గుంటల భూమి మా నాన్న పేరుతో ఉన్నదానికి నాకు ఇప్పించాలని ఆ గ్రామానికి చెందిన బర్ల బీరయ్య సోమవారం ప్రజావాణిలో కలెక్టర్‌కు విన్నవించుకున్నాడు. గతంలో సర్వే నంబర్‌లో 1/1లో 6 గుంటలు, సర్వే నంబర్ 1/జడ్‌లో 6 గుంటల భూమి ఇళ్ల స్థలాల కోసం తీసుకొని రద్దుబదలుగా సర్వే నంబర్ 233/ఎ/4లో మా నాన్న బర్ల రామయ్యకు రాసి ఇచ్చారని, సదరు భూమిని నేడు రెవెన్యూ అధికారులు తమకు కాకుండా కబ్జాలో లేని మరో వ్యక్తి పేరుతో రికార్డులు మార్చారని ఆవేదన వ్యక్తం చేశాడు.